# వాయుదేవుని గాలిపటం

పెద్దమ్మాయీ అబ్బాయీ వసారాలో గాలిపటాలు చేస్తూ కూర్చున్నారు. అబ్బాయికి ఆరో ఏడు. అమ్మాయికి మాత్రం పెద్దఅమ్మాయి అని పేరేగాని దానికి మాత్రం ఎన్నేళ్లు? పది.

"అక్కా, గాలిపటాన్ని ఎగిర్యేది ఎవరో తెలుసా?" అని అడిగాడు అబ్బాయి. గాలిపటాలు చెయ్యటంలో తన అక్క కంటే తనకే ఎక్కువ తెలుసని వాడి అభిప్రాయం. తన అక్క వారం రోజులక్రితం నికేతనాన్నుంచి సెలవలకు ఇంటికి వొచ్చింది. అప్పటినుంచే గాలిపటాలు చేస్తూవుంది. తాను అప్పటికి నెలరోజులనుంచీ చేస్తున్నాడు. తన వయస్సులో తన అక్క తనకంటే ఎక్కువ గాలిపటాలే చేసిందని వాడికేం తెలుసు?

కాగితానికి అన్నంమెతుకులు రాస్తూ కూర్చున్న వాళ్ల అక్క వాడి ప్రశ్నకు జవాబు చెప్పలేదు. వాళ్ళ అక్కముందు

N. S. NARASU, M. A., LL. B
EDUCATION OFFICER



తన తెలివి చూపించుకోవాలని ఉబలాట పడుతున్నవాడు ఊరుకోలేదు. మళ్ళీ అడిగాడు.

"తెలుసు" అన్నది వాళ్ళ అక్క.

"తెలిస్తే చెప్పుచూద్దాం" అన్నాడు వాడు.

కాసేపు వాడికేమీ తోచలేదు. మెదలకుండా కూర్చున్నాడు. ఆలోచించాడో ఏమో! ఒక ఎత్తు ఎత్తాడు.

"నీకు తెలిస్తేగా చెప్పటానికీ" అన్నాడు.

ఈ ఎత్తుకి పెద్దమ్మాయి పడలేదు. పడకపోగా ఇట్లా అన్నది-"నీకు తెలియక నాతో చెప్పించుకుందాం అనీ..."

ఈ మాటలకు వాడికి కోపం వొచ్చింది. "నాకు తెలుసు" అన్నాడు.

"తెలిస్తే చెప్పు చూద్దాం."

వాడు చెప్పాడు—"వాయుదేవుడు"

పెద్దమ్మాయి నవ్వింది. నవ్వి "ఇదేనా నీకు తెలిసింది!" అని అడిగింది.

"ఏం అక్కా!" వాడు ఆశ్చర్యంగా అడిగాడు.

"తప్పు, వాయిదేవుడు కాదు."

"మరెవ్వరు అక్కా!"

అక్క చెప్పేసింది-"గాలిదేవుడు...గాలిపటాన్ని ఎగిర్చేది గాలిదేవుడు."

అబ్బాయి వొప్పుకోలేదు. వాడికి వొప్పుకోవలసిన అవసరం కనిపించలేదు. వాడికి పాఠాల్లో వాయుదేవుడనేమాటే వొచ్చింది. పాఠాలకంటే అక్క గొప్పా? "కాదక్కా! వాయు

దేవుడే" అన్నాడు. అమ్మాయి వొప్పుకోలేదు. వొప్పుకోవల సిన అవసరం అమ్మాయికి కనిపించలేదు. అమ్మాయి చిన్న ప్పుడు చదువుకున్న పాఠాలు మరచి పోయింది. జీవితంలో వాడుకునే మాటలే జ్ఞాపకం వుంటున్నై "కాదు గాలిదేవుడు" అన్నది.

"పోనీ అమ్మని అడుగు" వాడన్నాడు.

"అమ్మకేం తెలుసు? కావాలంటే నాన్ననడుగు." అమ్మ తన పక్షం అని వాడి ఉద్దేశం. నేను తన పక్షం అని వాడి ఉద్దేశం. నేను తనపక్షం అని అమ్మాయి ఉద్దేశం. అమ్మ కంటే నాన్నకి ఎక్కువ తెలుసనే విషయం వాడికి బొత్తిగా నచ్చలేదు. "నాన్నకి యిరవై ఏళ్ళయితే అమ్మకి డెబ్బై ఏళ్ళు" అన్నాడు. ఏమన్నా అమ్మాయి వొప్పుకోలేదు తనే రైటనే ధీమా వున్నవాడికి నన్ను అడక్క తప్పలేదు. నెమ్మ దిగా నా గదిలోకి వొచ్చాడు.

"గాలిదేవుడా వాయుదేవుడా నాన్నా!" అని అడిగాడు "గాలిపటాన్ని ఎగిర్చేది" అని కలిపాడు.

వాణ్ణిచూస్తే నాకు జాలివేసింది. తను రైటని ఎంత నమ్మకం! తాను గెలవాలని ఎంత తాపత్రయం!! నేను తన పక్షం కాదని వీడు ఎందుకు అనుకుంటున్నాడో!

"ఏం నాన్నా?"

"రెండూ ఒకటే నాయనా"

వాడికి అర్థంకాలేదు. "అది నాన్నా అక్కేమో..." అని మొదలు పెట్టాడు.

"అవును నాయనా, అక్క చెప్పిందీ రైటే. నువ్వు చెప్పిందీ రైటే. గాలిదేవుడన్నా, వాయుదేవుడన్నా ఒకటే" అని విశదపరిచాను. కాని వాడికి అర్థంకాలేదు. తను గెలిచినట్టా? అక్కా గెలిచినట్టా? కొంచెంసేపు అట్లాగే నుంచుని నెమ్మదిగా కదిలాడు. వాడి వాలకాన్నిబట్టి 'అమ్మనడిగితే బాగుండేది' అని అనుకుంటూ ఉండి ఉంటా డనిపించింది. నాకు. ఎందుకో వాడు వాళ్ళమ్మ దగ్గరకు వెళ్ళలేదు. 'అమ్మ చెప్పినా అక్క వొప్పుకోదు' అనుకున్నాడేమో. సరాసరి వాళ్ళ అక్కదగ్గరకే వెళ్ళి చెప్పాడు.

"రెండూ వొకటే అట అక్కా"

వాళ్ళ అక్కమాట్లాడలేదు. వాడికేగాదు. పెద్దమ్మాయి క్కూడా నా జవాబు ఆశాభంగాన్నే కలిగించింది. నాన్న తన పక్షం అనుకున్నందుకు పశ్చాత్తాపపడుతూ ఉండి ఉంటుంది. ఆ సంగతి వాడు గ్రహించివుంటాడు.

"అమ్మని అడగనా అక్కా" అని అడిగాడు.

"నాన్నకి తెలియంది అమ్మకు తెలుస్తుందా ఏమిటి?" అని కసురుకుంది వాళ్ళ అక్క...

ఇద్దరూ మళ్ళీ పనిలో లీనం అయ్యారు—ఈసారిగాలి దేవుని వాయుపటాలు కట్టడానికి.

శ్రీ భార్గవి సంచార గ్రంథాలయం
సుందరగిరివారివీధి,
నెల్లూరు.
మేనేజరు